క్లుప్తంగా

రంజాన్ ప్రార్థనలకు మసీదులు సిద్ధం



తిరువూరు: రంజాన్ మాస ప్రార్థనలకు తిరువూరులోని మసీదులను సిద్ధం చేశారు. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న పవిత్ర రంజాన్ మాసంలో ప్రార్థనలకు జామియా మసీదు, కౌసర్, బిలాల్ మసీదులలో ఏర్పాట్లు చేశారు. ఇఫ్తార్, సహర్‌ల కోసం మసీదు కమిటీలు తగు ఏర్పాట్లు చేశాయి. మండలంలోని గానుగపాడు, ఆంజనేయపురం, రాజుగూడెం, రాజుపేట, తంగిళ్లబీడులలోని మసీదులలో రంజాన్ ప్రార్థనలకు సన్నాహాలు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు పరామర్శ



ఆగిరిపల్లి: వడ్లమానులో వైఎస్సార్ సీపీ నాయకుడు రంగయ్య అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, పార్టీ నాయకులు రంగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు రాణి మేకల సత్యనారాయణ, ఉప సర్పంచ్ నల్లిబోయిన రాంబాబు, రెడ్డి రామకృష్ణ, కుప్పాల శివనాగరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై ర్యాలీ



ఇబ్రహీంపట్నం: బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ పాఠశాల బాలికలకు కౌమార దశ, బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. యుక్త వయస్సు బాలికలు రక్తహీనతకు గురికాకుండా తగిన పోషకాహారం తీసుకోవాలన్నారు. బాలికల కౌమార దశలో శరీరంలో కలిగే మార్పులపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాల నివారణ ర్యాలీ నిర్వహించారు. కొండపల్లి ఎస్టీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బాలికలకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు మాధవి, రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, పద్మావతి, శ్రీదేవి, జ్యోతి, పెద్దికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ క్రీడల్లో విద్యార్థి ప్రతిభ



నూజివీడు: గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి గోపు విజయ్‌కుమార్ ఏలూరులో నిర్వహించిన సెంట్రల్ జోన్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించాడని హైస్కూల్ హెచ్ఎం పాట్నూరి రాధికారాణి శనివారం తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని హెచ్ఎంతో పాటు ఎస్ఎంసీ చైర్మన్ బావిశెట్టి వీరయ్య, పీడీ రవీంద్ర, ఉపాధ్యాయులు అభినందించారు.

బలివేలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ముసునూరు: మహా శివరాత్రి మహోత్సవాల ముగింపు అనంతరం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సర్పంచ్ రావు ప్రవీణ, ఎంపీడీఓ జి.రాణి పారిశుద్ధ్య పనులను చేయించారు. 200 మంది పారిశుద్ధ్య కార్మికులతో బలివే ఆలయ, ఉత్సవ ప్రాంగణం, తాత గుడి వీధి, గ్రామంలోని ప్రధాన వీధులు, సచివాలయం, పాఠశాల ఏరియాల్లో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలోని ఉత్సవ ప్రాంగణం, ఆలయానికి మూడు వైపులా ఉన్న రహదారులకు ఇరువైపులా రెండేసి కిలో మీటర్ల పొడవునా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు ఏరివేయించి, చెత్తచెదారాన్ని తొలగించి ట్రాక్టర్ల ద్వారా చెత్త శుద్ధి కేంద్రానికి తరలించారు. ఈఓపీఆర్డీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ధర్మావతి, ఆరేపల్లి వెంకటేశ్వరరావు గ్రామ వీధులన్నింటా క్లోరినేషన్ చేయించారు. వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న నీటి కష్టాలు

- అటకెక్కిన సాగర్ జలాల సరఫరా
- జనవరి, ఫిబ్రవరిలో మూడు రోజుల చొప్పున సరఫరా
- మంత్రి ఉన్నా ప్రయోజనం శూన్యమని రైతుల ఆగ్రహం



నూజివీడు మేజర్ కాలువ తడవడానికే సరిపోక అరకొరగా వచ్చిన సాగర్ జలాలు

నూజివీడు: రబీ సీజన్‌లో నూజివీడు నియోజకవర్గానికి ప్రధాన నీటి వనరు నాగార్జున సాగర్ ప్రాజెక్టు జలాలే. రైతులు సాగు చేసిన ఆరుతడి పంటలకు, నియోజకవర్గంలో విస్తరించిన మామిడి తోటలకు సాగునీరు పెట్టుకోవడమే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చెరువులను సాగర్ జలాలతో నింపుకుని వేసవిలో మంచినీటి సమస్య లేకుండా చూసుకుంటారు. అయితే ఈ ఏడాది సాగర్ జలాల సరఫరా మూణ్నాళ్ల ముచ్చటగా తయారైంది. నూజివీడు నుంచి మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్నప్పటికీ సాగర్ జలాలను తీసుకురావడంలో విఫలమయ్యారని స్థానిక రైతులు విమర్శిస్తున్నారు. నూజివీడు బ్రాంచి కాలువ, వేంపాడు మేజర్ పరిధిలో నూజివీడు నియోజకవర్గం ఉంది. ఈ రెండు ప్రధాన కాలువలకు సాగర్ జలాలను సరఫరా చేస్తే చాట్రాయి, ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లోని చెరువులను నింపుకోవడంతో పాటు రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటతో పాటు మామిడి తోటలకు సాగర్ జలాలను మళ్లించి నీటి తడులు పెట్టుకుంటారు. ఈ ప్రాంతానికి సాగర్ జలాలను షెడ్యూల్ ప్రకారం నవంబర్ 15 నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు సరఫరా చేయాలి. అయితే ఫిబ్రవరి నెల ముగిసినా సాగర్ జలాలు సరఫరా కాలేదని రైతులు వాపోతున్నారు.

మూడు రోజులు మాత్రమే..

జనవరి నెలలో సంక్రాంతి సమయంలో మూడు రోజులు, ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు మూడు రోజుల చొప్పున సాగర్ జలాలను అరకొరగా విడుదల చేశారు. సాగునీటి సంఘాల పదవులపై అధికార పార్టీ నాయకులకు ఉన్న ఆసక్తి సాగర్ జలాల సరఫరా విషయంలో లేకపోవడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడటం కానీ, ఇక్కడి అధికారులు తెలంగాణ రాష్ట్రానికి చెందిన అధికారులతో మాట్లాడటం కానీ చేసి సాగర్ జలాలను తీసుకురావడంలో విఫలమయ్యారని రైతులు వాపోతున్నారు. ఏలూరు జిల్లాలోని నూజివీడు బ్రాంచి కాలువ పరిధిలో ఉన్న నూజివీడు మేజర్, బాపులపాడు మేజర్, మాచవరం మేజర్‌లతో పాటు వేంపాడు మేజర్ తదితర వాటి కింద మొత్తం 70 వేల ఎకరాల ఆయకట్టులో రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరు సరఫరా కాలేదు.

కాలువలు తడవడంతోనే సరి..

ఇటీవల మూడు రోజుల పాటు రోజుకు 200 నుంచి 250 క్యూసెక్కుల సాగర్ జలాలను మాత్రమే నూజివీడు బ్రాంచి కాలువకు విడుదల చేశారు. అరకొరగా విడుదల చేసిన సాగర్ జలాలు ఎగువ ప్రాంతంలో నూజివీడు బ్రాంచి కాలువపై అండర్ టన్నెల్స్‌కు ఉన్న రంధ్రాల ద్వారా వాగుల్లోకి చేరి ఎన్టీఆర్ జిల్లాలోని రెడ్డిగూడెం మండలంలోని చెరువుల్లోకి చేరాయి. దీంతో నూజివీడు ప్రాంతానికి రాలేదు. నూజివీడు మేజర్‌పై 5వ కిలో మీటరు వరకు, మాచవరం మేజర్‌లో 4వ కిలో మీటరు వరకు కాలువ తడవడానికి మాత్రమే ఉపయోగపడ్డాయి. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలోని చెరువులన్నీ ఖాళీగా ఉన్న నేపథ్యంలో రానున్న వేసవిలో భూగర్భ జలాలు పడిపోతే మంచినీటికి ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మూడు రోజులే వచ్చాయి

> మూడు రోజుల పాటు సాగర్ జలాలను రోజుకు 250 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. అవి నూజివీడు ప్రాంతానికి అరకొరగానే చేరాయి. ప్రస్తుతం ఎగువన జోన్-2లోనే తెలంగాణ ఎన్నెస్పీ అధికారులు గత నెల 19నే పూర్తిగా నిలిపివేశారు.
>
> – సీతారావమ్మ, ఎన్నెస్పీ ఓఅండ్ఎం డీఈ, నూజివీడు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



నూజివీడులోని శారద జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వస్తున్న ఇంటర్ విద్యార్థులు

మైలవరం: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మైలవరంలోని మూడు కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 235 మంది విద్యార్థులకు గాను 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 213 మంది పరీక్షలు రాశారని చీఫ్ సూపరింటెండెంట్ పి. రాధాకృష్ణ తెలిపారు. ఎస్వీ ఆర్‌జీఎస్ఆర్ కళాశాలలో 185 మందికి ఐదుగురు గైర్హాజరయ్యారని కళాశాల సూపరింటెండెంట్ శారా తెలిపారు. లిటిల్ ఫ్లవర్ కళాశాలలో 140 మందికి గాను ఐదుగురు గైర్హాజరయ్యారని కళాశాల సూపరింటెండెంట్ సుభాషిణి చెప్పారు.

- **చాట్రాయి:** చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించిన ప్రథమ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 140 మంది విద్యార్థులకు 128 మంది పరీక్షలు రాయగా 12 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

నూజివీడులో తొలిరోజు 122 మంది గైర్హాజరు

నూజివీడు: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు పట్టణంలో శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారద కళాశాల, సెయింట్ ఆన్స్ కళాశాల, శ్రీ వాగ్దేవి కళాశాల, శ్రీసిద్ధార్థ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఐదు పరీక్ష కేంద్రాల్లో కలిపి 1,931 మంది విద్యార్థులకు గాను 1,809 మంది పరీక్షలకు హాజరు కాగా, 122 మంది గైర్హాజరయ్యారు. అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్య చికిత్స అందించేందుకు ప్రతి కేంద్రం వద్ద ఏఎన్ఎంలను నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా దుర్గాప్రసాద్, టి. విజయ, వి. రాధిక పద్మశ్రీ, సీహెచ్ జాన్, ఇ. దేవమణి వ్యవహరించారు.

- **తిరువూరు:** తిరువూరులో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తిరువూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, నాగార్జున, శ్రీనిధి జూనియర్ కళాశాలల్లో 1,203 మంది విద్యార్థులకు గాను 1,147 మంది హాజరయ్యారు. 57 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. గంపలగూడెంలో 283 మంది విద్యార్థులకు గాను 13 మంది గైర్హాజరయ్యారు.

బాలికా విద్యపై అవగాహన ప్రదర్శన



తిరువూరులో బాలికా విద్యపై అవగాహన ప్రదర్శన

తిరువూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాలికా విద్యపై అవగాహన కల్పిస్తూ తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీడీపీఓ సత్యవతి తెలిపారు. బాలికా విద్య, బాల్యవివాహాల నిరోధం, కిశోర బాలికల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శనివారం పలు గ్రామాల్లో పాఠశాల విద్యార్థులతో అవగాహన ప్రదర్శనలు జరిగాయి. తిరువూరు పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, తోకపల్లి ఎంపీయూపీ స్కూళ్లలో విద్యార్థులకు బాలికా విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు.

మూఢ నమ్మకాలు పారదోలేందుకు జేవీవీ కృషి

జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్



మాట్లాడుతున్న గంగాధర్

తిరువూరు: సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలు, సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో జేవీవీ పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. చేతబడులు, బాణామతి వంటి దురాచారాలను నిర్మూలనకు జేవీవీ కృషి చేసిందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, జేవీవీ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, జిల్లా కార్యదర్శి రాంప్రదీప్ పాల్గొన్నారు.

60 లీటర్ల సారా స్వాధీనం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఆగిరిపల్లి: మండల పరిధిలోని సింహాద్రి అప్పారావుపేటలో ఎక్సైజ్ అధికారులు దాడుల నిర్వహించి 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా విక్రయిస్తున్న కూరాకుల శ్రీనివాసరావు ఎక్సైజ్ అధికారులను చూసి తప్పించుకుని పారిపోయాడు. అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్ కుమార్ సింగ్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు ఫణికుమార్, ఎండీ ఆరిఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

గానుగపాడు(తిరువూరురూరల్): గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం శనివారం నిర్వహించారు. త్వరలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగనున్నందున అత్యధిక మార్కుల సాధనకు తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు వివరించారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు రాంప్రదీప్, రామారావు, రాజేంద్ర, సుదర్శన్ పర్యవేక్షించారు.

రేపు ప్రాంగణ ఎంపికలు

విస్సన్నపేట: విస్సన్నపేట వికాస్ పీజీ, ఫార్మసీ కళాశాలల్లో ఈ నెల 3న ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తామని కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి తెలిపారు. బీఫార్మసీ, ఎం ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటీఐ, ఎంఎస్సీ మైక్రో బయాలజీ విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లో పాల్గొనవచ్చన్నారు. ప్రముఖ ఔషధ సంస్థ జోడాస్ ఈ ఎంపికలు నిర్వహిస్తుందని చెప్పారు. ఇతర వివరాలకు కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి చల్లా సుధీర్‌రెడ్డి సెల్: 98495 53107 నంబరును సంప్రదించ వచ్చన్నారు.

నేడు స్వర్గపురి దాతలకు సన్మానం

తిరువూరు: తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్గపురిలో సదుపాయాల కల్పనకు విరాళాలిచ్చిన దాతలకు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని సంఘ ప్రతినిధులు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సాయంత్రం నాలుగు గంటలకు స్వర్గపురిలో నూతన వాహనం కొనుగోలుకు విరాళాలిచ్చిన దాతలను సత్కరిస్తామని చెప్పారు.

మాదిగ అమర వీరుల దినోత్సవం



ఇబ్రహీంపట్నంలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు

ఇబ్రహీంపట్నం: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన వారి జ్ఞాపకార్థం మాదిగ అమరవీరుల దినోత్సవం ఇబ్రహీంపట్నంలో శనివారం నిర్వహించారు. అమరులైన మాదిగల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకుడు కోట దానియేలు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. విజయ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి రామారావు, నాయకులు పాల్గొన్నారు.

వీరులకు మరణం లేదు



మైలవరంలో మాదిగ అమరవీరులకు నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మైలవరం: వీరులకు మరణం ఉండదని, మాదిగ జాతి ఉన్నంత కాలం వారు సజీవంగా ఉంటారని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మందా వెంకటేశ్వరరావు అన్నారు. మైలవరం యూనియన్ బ్యాంక్ సెంటర్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద మాదిగ అమర వీరుల దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం నిర్వహించారు. ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు ఇంకొల్లు జమలయ్య, మాజీ ఎంపీటీసీ బుద్దే యోహాన్, ఎంఎస్పీ మండల ఇన్‌చార్జి నాగరాజు, కొండల రామారావు, మట్టకోయ్య సుందరదాసు, సగ్గుర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పక్కన చెత్త తొలగించాలి

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్తను తొలగించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. పోలవరంలో శనివారం రోడ్ల పక్క చెత్తను తొలగింపు పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రోడ్ల పక్కన ఉన్న చెత్త కుప్పలను తొలగించి ఆయా గ్రామాల్లోని సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఉద్యోగుల సంక్షేమాన్ని మరిచారు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రభుత్వం మరిచిందని సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్‌జీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కెరగడ్డ సత్యం శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. డీఏ, ఐఆర్ ఊసే లేదని, కనీసం ఉద్యోగుల సరెండర్ సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం లేదని, ఉద్యోగులకు ఎలాంటి కేటాయింపులు చేయకుండా తీరని అన్యాయం చేశారని, ఇది ఎంతమాత్రం సమంజసం కాదన్నారు.

నేడు నూజివీడులో బాలోత్సవం

నూజివీడు: నూజివీడు బాలోత్సవం కార్యక్రమం పట్టణంలోని సారథి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహిస్తామని కమిటీ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కాసాని గాంగేయుడు శనివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మూడు కేటగిరీల్లో 36 అంశాల్లో ప్రతిభ, ప్రదర్శనలకు పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రతి అంశంలో తొలి ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులను అందజేస్తామని చెప్పారు. ముఖ్య అతిథులుగా సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట రామిరెడ్డి, ప్రముఖ వైద్యుడు వల్లభనేని రాఘవరావు, హేలాపురి బాలోత్సవం సమన్వయ కార్యదర్శి గుడిపాటి నరసింహారావు పాల్గొంటారన్నారు.

గోటి తలంబ్రాలకు వడ్లు వలిచే కార్యక్రమం ప్రారంభం

తిరువూరు: గంపలగూడెం మండలం ఊటుకూరు కోదండ రామాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవానికి ఉపయోగించే తలంబ్రాల నిమిత్తం గోటితో వడ్లు వలిచే కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు వడ్లకు ప్రత్యేక పూజాదికాలు చేసి మహిళలకు అందజేశారు. శ్రీరామ నామ జపం చేస్తూ వడ్లను వలిచి తలంబ్రాలకు సిద్ధం చేయనున్నట్లు అర్చకులు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పద్మనాభుని సర్వేశ్వరరావు, సభ్యులు చెరుకూరి చిట్టెమ్మ పాల్గొన్నారు.

అంకెల గారడీ తప్ప ఉపయోగం లేని బడ్జెట్

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఊహాజనిత బడ్జెట్ అని, అంకెల గారడీ తప్ప రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేని బడ్జెట్ అని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరినాథ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్ నేతిబీరలో నెయ్యి చందంగా ఉందని, రైతులకు, నిరుద్యోగులకు, మహిళలకు తీవ్ర నిరాశ కల్పించిందని విమర్శించారు. కేవలం అప్పులపై ఆధారపడే పాలన సాగిస్తామన్న విషయాన్ని బడ్జెట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పిందన్నారు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు నామమాత్రంగా ఉన్నాయి. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి-సంక్షేమం జపంతో మరింత అప్పుల ఊబిలోకి దించేలా బడ్జెట్ ఉందని దుయ్యబట్టారు. రానున్న రోజుల్లో ప్రస్తుతానికి ఉన్న రూ.80 వేల కోట్ల ద్రవ్యలోటు భర్తీ చేసుకోవడానికి ప్రజలపై అదనపు భారాలు వేయడం ఖాయమన్నారు. ఇరిగేషన్ రంగానికి కేటాయింపులు గతం కన్నా తగ్గాయని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధుల ఊసేలేదని, కౌలు రైతులకు మొండిచేయి చూపారని, సూపర్ సిక్స్ హామీలు అమలయ్యే విధంగా కేటాయింపులు బడ్జెట్‌లో చేయలేదని హరినాథ్ విమర్శించారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నూజివీడు: మహా శివరాత్రి సందర్భంగా ముసునూరు మండలం బలివే రామలింగేశ్వరస్వామి ఉత్సవాల్లో పాల్గొని తమ్మిలేరులో మునిగి చనిపోయిన ముగ్గురు యువకుల కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ డిమాండ్ చేశారు. పేద వర్గాలకు చెందిన మూడు కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ ఉదయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. నరసింహ మాట్లాడుతూ ఇద్దరు యువకులు లింగపాలెం మండలం తిమ్మక్కపాలెంకు చెందిన అన్నదమ్ములని, ఒకే కుటుంబంలో ఇద్దరు చనిపోవడంతో తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా ఉందని చెప్పారు. మరో యువకుడు ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంకు చెందిన వ్యక్తి అని తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, అర్హత కలిగిన వారికి ప్రభుత్వ ఉద్యోగం, రెండెకరాల భూమి మంజూరు, పక్కా గృహ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు చెంగల వెంకటేశ్వరరావు, కొక్కిరపాటి ఆనంద్, రెడ్డి నాగనరసింహారావు, పేరిచర్ల శ్రీ వెంకటేశ్వరరావు, బొప్పూడి రాంబాబు పాల్గొన్నారు.

ఎన్‌పీటీఈఎల్ ప్రారంభం

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కలిసి నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) సంస్థను ప్రారంభించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు శనివారం తెలిపారు. ఈ సంస్థ ద్వారా అధ్యాపకులు, విద్యార్థులు ఆన్‌లైన్‌లో అనేక కోర్సులను (మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్స్-ఎంఓఓసీఎస్) ప్రవేశపెట్టారని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తూ ఉత్తీర్ణులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నామన్నారు. ఎన్‌పీటీఈఎల్ 2024 అక్టోబర్‌లో పరీక్షలు నిర్వహించిందని, అధ్యాపకులు, విద్యార్థుల ప్రతిభ పాటవాలకు ఎల్బీఆర్సీఈ ఎన్‌పీటీఈఎల్ లోకల్ చాప్టర్‌కు ఏ గ్రేడ్ లభించిందని చెప్పారు. ఈ పరీక్షలో 894 మంది ఉత్తీర్ణులయ్యారని, అందులో 20 మంది టాపర్లుగా, 12 మంది ఎలైట్‌ప్లస్ గోల్డ్, 158 మందికి ఎలైట్ ప్లస్ సిల్వర్, 449 మందికి ఎలైట్, 275 మంది ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

తిరువూరు: స్థానిక సుగాలీ కాలనీలో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. కొన్ని రోజులుగా ఒక నివాసంలో జూదాలు జరుగుతున్నట్లు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి నిర్వహించారు. నలుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.9,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులు పరారు కాగా వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. మండలంలోని చిట్టేల సమీపంలో కూడా రాత్రి వేళ జూదాలు పెద్దఎత్తున జరుగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

పైపులైన్ పనులు నిలుపుదల చేయాలని వినతి

వీరులపాడు: వైరా ఏటిలోని నీటిని పైపులైన్లు వేసి అక్రమంగా కర్మాగారాలకు తరలిస్తే రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నందలూరు గ్రామ సమీపంలోని వైరా కట్టలేరు వద్ద నీటిని తరలించేందుకు ఏర్పాటు చేస్తున్న పైపులైను పనులను నిలుపుదల చేయాలని కోరుతూ రైతులు శనివారం డెప్యూటీ తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలోని సెందినీ కర్మాగారం యజమానులు నిబంధనలకు విరుద్ధంగా భారీ ఎత్తున మోటార్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వైరాఏటిలోని రక్షిత మంచినీటి పథకం నుంచి నందలూరు, తాటిగుమ్మి, బోడవాడ, జమ్మవరం గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని కర్మాగారం నీటిని తరలిస్తే తాగునీటికి అలమటించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. డీటీకి వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు ఏలూరు సురేష్, వెంకటేశ్వరరావు, రాము, జూపూడి కోటేశ్వరరావు, భిక్షాలు, చిరంజీవి, పలువురు రైతులు ఉన్నారు.